క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పాటుపడాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 2025–26ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, మండల ఇంజినీరు గంగరాజు, ఈఓ అజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సమ్మెలోకి 108 సిబ్బంది



తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ నుంచి 108 సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాణ్యం 108 సిబ్బంది తిమ్మయ్య, చెన్నయ్య, దినేష్, రంగన్న మాట్లాడారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం, అరబిందో సంస్థ దాటవేస్తున్నందున సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా 108సర్వీసులను నిర్వహించాలన్నారు. అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం స్లాబ్ లవారీగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీపీఓ, ఎంపీపీ

పాణ్యం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు రూపొందించుకోవాలని డీపీఓ నమీవుల్లా సూచించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాయంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి డీపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వనరులు, రాబడి, అభివృద్ధిపై ఇస్తున్న శిక్షణను ప్రజాప్రతినిధులు, అధికారులు సద్వినియోగం చేసుకోవాలని, పల్లెల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరీ హుండీ కానుకల లెక్కింపు



అమ్మవారి హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ హుండీ కానుకలను ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. ఈఓ నరసయ్య, పెరవలి ఈఓ వీరయ్య ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కానుకలను లెక్కించారు. అమ్మవారికి రూ.42,82,600 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసయ్య తెలియజేశారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వృద్ధురాలు మృతి

కోడుమూరు రూరల్ : గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనుగొండ్ల గ్రామ సమీపంలో ఉన్న ఎల్ఎల్‌సీ కాల్వలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధురాలు పడి మృతి చెందింది. గూడూరు ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోడుమూరులోని బుడగజంగాల కాలనీకి చెందిన వృద్ధురాలు విబూది మాంతమ్మ(71) మూర్ఛరోగంతోపాటు, మతిస్థిమితం సరిగా లేక ఊర్లు పట్టుకుని తిరిగేది. ఈ నేపథ్యంలో చనుగొండ్ల గ్రామ సమీపంలో ఉన్న ఎల్ఎల్‌సీ కాల్వలో గురువారం శవమై తేలింది. దీంతో గూడూరు పోలీసులు వృద్ధురాలి శవాన్ని బయటకు తీశారు. అయితే వృద్ధురాలు మాంతమ్మ నీళ్లు తాగేందుకు వెళ్లిన సందర్భంలో ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు కాల్వలోపడి మృతి చెందిండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మృతురాలి కుమారుడు కార్తీక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్లు ఇలా... ప్రయాణం సాగేదెలా?

- గుంతలమయంగా కోడుమూరు, వెల్దుర్తి రహదారి
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- దాదాపు 12 కిలోమీటర్లు మరీ అధ్వానం
- చుట్టూ తిరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సులు



గుంతల రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్న ద్విచక్రవాహనదారుడు



అధ్వానంగా ఉన్న కోడుమూరు-వెల్దుర్తి రోడ్డు



కోడుమూరు రూరల్: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు. ప్రత్యేకించి కోడుమూరు – వెల్దుర్తి గుంతలయంగా మారింది. దాదాపు 15 గ్రామాలకు ప్రధాన రోడ్డు. అదేవిధంగా డోన్ ప్రాంత ప్రజలు ఎమ్మిగనూరు, మంత్రాలయం వెళ్లాలన్నా... ఈ ప్రాంతం ప్రజలు డోన్, బనగానపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సిన ఈ రోడ్డే ప్రధానం. కర్నూలు వెళ్లకుండా ఈ రోడ్డులో వెళ్తే యాభై కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇంత ప్రాముఖ్యత ఉన్న ఈ రోడ్డును పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కోడుమూరు నుంచి వెల్దుర్తికి 32 కిలోమీటర్లు ఉంటుంది. అయితే వెంకటగిరి నుంచి లద్దగిరి వరకు సుమారు 12కిలోమీటర్ల మరీ అధ్వానంగా ఉంటుంది. కేవలం 12 కిలోమీటర్లు ప్రయాణించేందుకు 50 నిమిషాలు పడుతున్నట్లు వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లలేక వెంకటగిరి నుంచి ఎర్రదొడ్డి, అనుగొండ, అల్లినగరం గ్రామాల మీదుగా లద్దగిరి వెళ్తున్నారు. అక్కడి నుంచి వెల్దుర్తికి వెళ్తున్నారు. మరికొందరు వాహనదారులు వెంకటగిరి, ఎర్రదొడ్డి క్రాస్‌రోడ్డు మీదుగా గోరంట్లకు వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పది కిలోమీటర్లు దూరం పెరిగినా...

కోడుమూరు– వెల్దుర్తి రోడ్డుకు సంబంధించి 12 కిలోమీటర్లు మరీ అధ్వానంగా ఉంది. కోడుమూరు నుంచి లద్దగిరి వరకు ప్రయాణం నరకమయంగా మారింది. కోడుమూరు నుంచి వెంకటగిరి, గోరంట్ల మీదుగా లద్దగిరికి....అక్కడి నుంచి వెల్దుర్తికి వెళ్తుంటారు. అయితే ఈ రోడ్డు బాగలేకపోడంతో ఎర్రదొడ్డి క్రాస్ మీదుగా వెళ్తున్నారు వాహనచోదకులు. అంటే దాదాపు 10 కిలోమీటర్లు దూరం పెరిగినా ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నారు ఆటో డ్రైవర్లు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులు సైతం ఈ రోడ్డు మీదుగానే వెళ్తున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

కూలి గిట్టుబాటు కావడం లేదు



గోరంట్ల నుంచి కోడుమూరుకు 10కిలోమీటర్లు ఉంది. అయితే రోడ్డు బాగాలేక చుట్టూ 15కిలోమీటర్లు తిరిగి గోరంట్ల నుంచి కోడుమూరుకు వెళ్తున్నాం. దీంతో దూరం పెరిగి డీజిల్ ఖర్చు కూడా పెరుగుతుంది. రోజంతా ఆటో నడిపినా కూలి గిట్టుబాటు కావడం లేదు. అయినా తప్పని పరిస్థితి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– సురేష్, ఆటో డ్రైవర్

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



ఏ పని కావాలన్న ఖచ్చితంగా కోడుమూరుకు వెళ్లాల్సిందే. రోడ్డు బాగోలేక గోరంట్ల నుంచి కోడుమూరుకు రావాలంటే సుమారు గంటకుపైగా సమయం పడుతుంది. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై నిత్యం ఎక్కడ కింద పడతామోనన్న భయంతో ప్రయాణం చేస్తున్నాం. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయిస్తే సంతోషిస్తాం.

– గోపాల్, గోరంట్ల

స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి



స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ గాడిరూతమ్మ, సర్పంచ్ పట్టె హనుమంతు

కోడుమూరు రూరల్ : క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని కోడుమూరు ఎంపీపీ గాడి రూతమ్మ సూచించారు. మండలంలోని లద్దగిరిలో గురువారం వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని ఎంపీపీ గాడిరూతమ్మ, సర్పంచ్ పట్టె హనుమంతు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రమాదకరమైన జబ్బుల్లో క్యాన్సర్ ఒకటని, స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని సర్పంచ్ భాగ్యర్నత ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.భాస్కర్, డా. శ్రీమంత్‌మాదన్న, సీహెచ్‌ఓ శాంతమ్మ, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, శారద తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు పీహెచ్‌సీలో గురువారం కామన్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ ప్రారంభించారు. అనంతరం పంచలింగాల–2 గ్రామ ఆరోగ్య క్లినిక్‌ను సందర్శించి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ అండ్ ఏఎన్ఎం ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా హైపర్ టెన్షన్, డయాబెటిస్, మెలిటస్, సాధారణ క్యాన్సర్ల గురించి అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. స్క్రీనింగ్‌లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో పీఓఎస్‌సీడీ అండ్ ఆర్‌బీఎస్‌కే హేమలత, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజూష తదితరులు పాల్గొన్నారు.

చెంచుకాలనీలో క్యాన్సర్ పరీక్షలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని చెంచుకాలనీలో గురువారం మద్దూరు పీహెచ్‌సీ సిబ్బంది క్యాన్సర్ పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తొమ్మిది నెలలపాటు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు ఐదుకుటుంబాలకు పరీక్షలు చేస్తామన్నారు. ప్రతి కుటుంబంలోని సభ్యులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేస్తామని వివరించారు.



చెంచుకాలనీలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కమిటీ నాయకుడు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం నాయకులు కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో భాగంగా పింఛన్లు, ఉచిత గ్యాస్ పథకాలను మాత్రమే ప్రభుత్వం అమలు చేసి, మిగిలిన పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా కింద రైతులకు ఏడాదికి రూ.20వేలు, తల్లిదండనం పేరుతో రూ.15వేలు, 18సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని వారు తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీపీ వీరన్న, బుడ్డప్ప, వీరన్న, గంగాధర్, గిడ్డయ్య, మద్దిలేటి, శేఖర్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో...

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ట్రూ ఆప్ చార్జీల వసూళ్లను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గూడూరులో సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, మాధవకృష్ణయ్య, రామాంజినేయులు, మధు, అంజి, మల్లికార్జున,నాగేష్, గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

కర్నూలు (టౌన్): కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు పలు చోట్ల దాడులు చేశారు. బెల్టు షాపుల పేరుతో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఓర్వకల్లు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన హేమలత అనే మహిళ వద్ద 42 మద్యం బాటిళ్లు, కర్నూలు పట్టణంలోని కల్పనా దాబా వద్ద షేక్ సుభాన్ అనే వ్యక్తి వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు వెల్లడించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు రెహనా బేగం పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్

కల్లూరు: గ్రామీణుల అవసరాలకు అనుగుణంగా 2025–26 సంవత్సరానికి జీపీడీపీ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ మహిళా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలను ప్రణాళికల తయారీలో భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, ఈఓఆర్డీ నాగేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ రఘునాథ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షకుడు అస్రత్ బాషా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనను వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనురాధ, పంచాయతీ సెక్రటరీ ఆయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని చెప్పారు. విద్యతోపాటు క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.

సి.బెళగల్: ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పోలకల్ రెగ్యులర్ స్కూల్ హెచ్ఎం రేవుల శ్రీనివాసులు, సి.బెళగల్ రెగ్యులర్ స్కూల్‌లో హెచ్ఎం కిషోర్‌కుమార్, తిమ్మందొడ్డి ప్రైమరీ స్కూల్‌లో హెచ్ఎం నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆయా స్కూళ్లలో నెహ్రూ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం మొదటి ప్రధాని దివంగత చాచా నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం (మైనార్టీ) కస్తూర్బా విద్యాలయంలో నెహ్రూ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గడివేముల గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసిన దృశ్యం

గడివేముల: పుస్తక పఠనంతో విజ్ఞానం వస్తుందని గ్రంథాలయ అధికారి వెంటేశ్వరరెడ్డి తెలిపారు, గురువారం గడివేములలోని గ్రంథాలయంలో 57వ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రంథాలయంలో గురువారం ఆ శాఖ నిర్వాహకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలను ఎంఈఓ ఆదామ్‌బాషా, పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంథాలయంలో వారు బాలికలకు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయా స్కూళ్లలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నన్నూరు, ఓర్వకల్లు గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖ గ్రంథాలయ అధికారులు కౌసల్య, హనుమేనాయక్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఎంఈఓ సుబ్రమణ్యం, పశువైద్యశాఖ ఏడీపీ కమలాకర్, గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు కుర్చీలాటను ప్రారంభించారు.

నేడు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

సి.బెళగల్: గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాల్లో ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామైఖ్య సంఘం సభ్యులు హాజరు కావాలని సూచించారు.

ఆరోగ్య పోషణపై అవగాహన

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు ఆహార, ఆరోగ్య, పారిశుద్ధ్యం సమగ్రంగా అవగాహన పెంచాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల సూచించారు. గురువారం కర్నూలు శివారులోని ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీడీ పాల్గొని ఆహారం, ఆరోగ్య పోషణపై సూచనలు ఇచ్చారు. ఏపీడీ శ్రీధర్ రావు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పీపీగా ప్రకాష్‌రెడ్డి

కర్నూలు (లీగల్): పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నాలుగో అదనపు జిల్లా కోర్టు పీపీ వై.ప్రకాష్ రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు పని చేసిన వి.వెంకటేశ్వరరెడ్డి పదవీ కాలం ముగియడంతో ఈ స్థానంలో ప్రకాష్‌రెడ్డిని నియమించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. ఫ్రెషర్స్‌డే వేడుకలను పురస్కరించుకొని గురువారం వర్సిటీలో పీజీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. చదువు, క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి తన దినచర్యలో క్రీడలను భాగం చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు సూచించారు. వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

డిజిటల్ ఓపీ కౌంటర్ల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిజిటల్ ఓపీ కౌంటర్లను గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ ఓపీ కౌంటర్‌తో పాటు ఇతర ఓపీ కౌంటర్లను ఆయన పరిశీలించారు. ఈ–హాస్పిటల్ స్కాన్ అండ్ షేర్, అభా ఐడీ, ఓపీ రిజిస్ట్రేషన్ల గురించి ఆరా తీశారు. ఈ డిజిటల్ ఓపీ సేవలను మరింతగా మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. కౌంటర్లలో త్వరగా ఓపీ ఇచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఈ డిజిటల్ ఓపీ కోసం ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వారి మొబైల్ నంబర్ వెంట తీసుకుని రావాలని సూచించారు. ఈ–హాస్పిటల్ నోడల్ అధికారి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.



ఓపీ కౌంటర్లను పరిశీలిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తనిఖీ

కర్నూలు (టౌన్): జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న డీసీఆర్‌బీ (జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో)ను గురువారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల రిజిస్టర్లు, పలు రికార్డులు, వార్షిక పనితీరు నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు డీసీఆర్‌బీ కీలకమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు వివరాలు అప్‌డేట్ చేస్తూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కోర్టు మానిటరింగ్ ఇన్‌చార్జ్ సీఐ రామయ్య నాయుడు పాల్గొన్నారు.



డీసీఆర్‌బీని తనిఖీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

17న రెవెన్యూ ఉద్యోగుల కార్తీక వన భోజనం

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ ఉద్యోగుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని అలంపూరల్‌లోని జోగులాంబ శక్తిపీఠంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున కలెక్టరేట్ నుంచి జోగులాంబకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేస్తామని, ఆసక్తి ఉన్న రెవెన్యూ ఉద్యోగుల కుటుంబాల వివరాలను ఈనెల 15వ తేదీలోపు కర్నూలు డివిజన్‌కు సంబంధించి డీటీ కె.రఘునాథ్ (6300663870), పత్తికొండ డివిజన్ వారు మద్దికెర ఆఫీసు సబార్డినేట్ వీరేష్ (8179107795), ఆదోని డివిజన్ వారు ఎమ్మిగనూరు ఆర్ఐ జెర్మియా (6305089087)కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఏపీఏఈయూలో జిల్లా వాసులకు చోటు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం కార్యవర్గంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఇద్దరికి ప్రాతినిధ్యం లభించింది. గురువారం వైఎస్సార్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘానికి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు అయింది. కమిటీలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటు డీ.శ్రీహరి కోశాధికారిగా, కర్నూలు జిల్లా నుంచి కర్నూలు డివిజన్ భూసంరక్షణ విభాగంలో సీనియర్ అసిస్టెంటు రూపేష్‌కుమార్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.